వేట సాగదు... పూట గడవదు..

రెండు నెలల పాటు వేట నిషేధ కాలం... తరువాత వరుస తుపానులతో గడిచిన మూడు నెలలుగా చేపల వేట లేక మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ప్రభుత్వం ఇస్తానన్న మత్స్యకార భరోసా నగదు ఎప్పుడిస్తారో అని ఆశగా ఎదురు చూస్తున్నారు. తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

- అందని మత్స్యకార భరోసా
- స్పందించని అధికారులు
- ఇబ్బందుల్లో మత్స్యకారులు



ఎస్.రాయవరం : మండలంలో బంగారమ్మపాలెం, రేవుపోలవరం ,కొత్తరేవుపోలవరంగ్రామాల నుంచి సుమారు 3 వేలమంది మత్యకారులు నిత్యం చేపల వేటకు వెలుతుంటారు.సుమారు అయిదు వందల బోట్లు పై బంగారమ్మపాలెం, రేవుపోలవరం తీరాల నుంచి చేపలు వేట చేసుకుని జీవనం గడుపుతుంటారు.అయితే ఈ ఏడాది మార్చి నెల నుంచి మే నెల వేట నిశేదింప సమయం రెండు నెలలు పాటు చేపల వేట నిషేధం, ఆ తరువాత వరుస తుపానులతో సుమారు నెల రోజులు పాటు వేటకు వెళ్లక పోవడం తో పస్తులు ఉండాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. అయితే ప్రభుత్వం ప్రతి ఏడాది ఏప్రిల్ , మే నెలలో మత్స్యకార భృతి వేసి తమ కుటుంబాలకు జీవనాధారం కల్పిస్తారు. అయితే ఈ ఏడాది మూడు న్నర నెలలు గడుస్తున్నా మత్స్యకార భరోసాపై ఊసే ఎత్తడం లేదని చెబుతున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో చెప్పిన సమయానికి తమకు వేట లేని సమయంలో జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క బటన్ నొక్కి తమ ఖాతాల్లో నగదు వేసేవారని చెబుతున్నారు. గడిచిన అయిదేళ్ల పాటు ఏప్రిల్ నెలలో రూ.10 వేలు చొప్పున నగదు వేశారని, ఇప్పుడు కొత్త ప్రభుత్వం రూ.20 వేలు ఇస్తామని చెప్పి మూడు 5 నెలలు గడుస్తున్నా తమకు రూపాయి కూడా సాయం రాలేదని వాపోతున్నారు. ఒక్క పక్క ప్రభుత్వం ఆదుకోక పోగా మరోవైపు చేపలు వేట లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందుతున్నారు. ఈ సమస్య అధికారులు చుట్టూ తిరుగుతున్నా తమకి సమాధాన రావడం లేదని చెబుతున్నారు. ప్రభుత్వ పెద్దలు త్వరగా నిర్ణయం తీసుకుని మత్స్యకారులను ఆదుకోవాలని కోరుతున్నారు.



ప్రభుత్వ సహాయం రాలేదని చెబుతున్న మత్స్యకారులు



వేట లేక వలలు అల్లుకుంటున్న మత్స్యకారులు

నగదు సహాయం అందించాలి



చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు మత్స్యకార భరోసా ఇవ్వాలి. ఈ ఏడాది నగదు ఏప్రిల్ నెలలో ఇవ్వాల్సి ఉంది. కానీ ఆగస్టు వచ్చినా ఇవ్వలేదు. వేట నిషేధం ముగిసిన తరువాత సుమారు నెల రోజులు వరుస తుపానులు వచ్చాయి. దీంతో ఆర్థిక ఇబ్బందులు తప్పలేదు. ప్రభుత్వం వెంటనే స్పందించాలి. ఎన్‌డీఏ ప్రభుత్వం రూ.20 వేలు వరకు పెంచి ఇస్తానని హామీ కూడా ఇచ్చింది. మత్స్యకారులు అది నమ్మి ఎన్‌డీఏ ప్రభుత్వానికి ఓట్లు వేశారు. ఇచ్చిన హామీ నెరవేర్చడంతో పాటు తక్షణమే నగదు విడుదల చేయాలి.

– చోడిపల్లి అప్పన్న, వైస్ ఎంపీపీ ఎస్ రాయవరం మండలం

మరో ఆధారం లేదు



తుపాను కారణంగా చేపలు వేట లేక ఖాళీగా ఉన్నాం. మూడు నెలలు క్రితం చేపలు వేట నిషేధం సమయంలో ఇవ్వాల్సిన నగదు సహాయం కూడా ప్రభుత్వం విడుదల చేయలేదు. మా గ్రామాల్లో చేపల వేట తప్ప మరో ఆధారం లేదు.

– కారే ముసిలి, కొత్త రేవుపోలవరం

ఆదుకోవాలి



చేపలు వేట లేక, ప్రభుత్వ సహాయం అందక పస్తులు ఉండాల్సి వస్తుంది. నెలలు గడుస్తున్నా అధికారులు స్పందించడం లేదు. పేదరికంలో ఉన్న మత్స్యకారులను సకాలంలో ఆదుకోవాలి.

– సూరాడ మాధవ, రేవుపోలవరం

క్లుప్తంగా

కోడ్ ఉల్లంఘనపై చర్యలేవీ..?



అరబుపాలెంలో ఫ్లెక్సీలు

మునగపాక : ఎంఎల్‌సీ ఎన్నికలకు సంబంధించి కోడ్ అమలులో ఉన్నా ఎక్కడా అధికారులు కోడ్ ఉల్లంఘన పట్టించుకోలేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాకు సంబందించి ఈ నెల 30న ఎంఎల్‌సీ ఎన్నికకు అవసరమయ్యే ఏర్పాట్లు ప్రభుత్వ యంత్రాంగం చేపట్టింది. అయితే కోడ్ అమలును పక్కాగా అమలు చేయాల్సిన అధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. అధికార పార్టీకి చెందిన ఫ్లెక్సీలను తొలగించడం లేదని స్థానికుల నుంచి ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి కోడ్‌ను దృష్టిలో ఉంచుకొని ఉల్లంఘన లేకుండా చూడాలని కోరుతున్నారు.

నాగవరం రోడ్డులో వాహన తనిఖీలు



నాగవరం రోడ్డులో వాహన తనిఖీలు చేస్తున్న ఏఎస్‌ఐ రామకృష్ణ

మునగపాక : ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా రికార్డులు వెంట ఉంచుకోవాలని ఏఎస్‌ఐ రామకృష్ణ కోరారు. మంగళవారం గాజువాక–అచ్యుతాపురం రోడ్డులోని నాగవరం వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. హెల్మెట్‌లు లేకుండా వాహనాలు నడిపినా అలాగే మద్యం తాగి వాహనాలు నడిపేవారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. అలాగే సెల్‌ఫోన్ డ్రైవింగ్, మైనర్లకు వాహనాలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రధానంగా గంజాయి అక్రమ రవాణాకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

రాంగ్ రూట్‌లో... భారీ లోడుతో



భారీ లోడుతో రాంగ్‌రూట్‌లో వెళుతున్న లారీలు

ఎస్.రాయవరం: అడ్డురోడ్డు జాతీయ రహదారిపై మంగళవారం భారీ లోడుతో మూడు లారీలు రాంగ్ రూట్ ప్రయాణిస్తూ వాహన చోదకులను ఆశ్చర్యానికి గురిచేశాయి. పోలీస్ సైరన్‌తో వచ్చిన వాహనాలు రాంగ్ రూట్ వస్తున్నాయని ఏమిటని కాసేపు ఆగి వాటికి సైడ్ ఇచ్చి ముందుకు సాగారు.

కుక్కల స్వైరవిహారంతో అవస్థలు



గాయపడిన గేదెపెయ్యి

మునగపాక : మండలంలోని గంగాదేవిపేటకు సమీపంలో మెయిన్‌రోడ్డులో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. మూగజీవాలపై దాడి చేసి గాయాలు పాలు జేస్తున్నాయంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. మూడు రోజులుగా రాత్రుల సమయంలో కుక్కలు ఆవు పెయ్యిలు అలాగే గేదె పెయ్యిలపై దాడులు చేయడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నక్కపల్లి : జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా స్థానిక పీహెచ్‌సీ సిబ్బంది అవగాహనా ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సుభాష్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ జరిగింది.

వైఎస్సార్‌సీపీలో జోష్..



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ

ఎస్.రాయవరం: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో మంగళవారం అడ్డురోడ్డులో జరిగిన వైఎస్సార్‌సీపీ సమావేశంతో పార్టీ కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. పార్టీ అభ్యర్థి బొత్స సత్యనారాయణను మంచి మెజారిటీతో గెలిపించి సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఈ సమావేశంలో బొత్సతోపాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి దత్తుడు సీతబాబురాజు, సెంట్రల్ బ్యాంకు మాజీ చైర్మన్ చంటిబాబురాజు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు బొలిశెట్టి గోవిందరావు, శ్రీరం నరసింహమూర్తి, కిల్లాడి శ్రీనివాసరావు, చిక్కాల రామారావు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, జెడ్పీటీసీలు కాకర దేవి, సిద్దాబత్తుల ఉమాదేవి, నక్కపల్లి ఎంపీపీ రత్నం, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సహకరించండి



మండల కార్యాలయంలో ఎంఎల్‌సీ నోటిఫికేషన్ వివరాలు ప్రదర్శిస్తున్న ఎంపీడీవో మన్మథరావు

మునగపాక : ఎంఎల్‌సీ ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ ప్రతులను మంగళవారం ఎంపీడీవో ఎం.మన్మథరావు అందుబాటులో ఉంచారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈవోఆర్డీ వెంకటలక్ష్మితో కలిసి సభ్యుల వివరాలతో కూడిన జాబితాను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా మన్మథరావు మాట్లాడుతూ ఈ నెల 30న ఎంఎల్‌సీ ఎన్నిక జరగనుందన్నారు. ఇందుకోసం ఓటు వేయనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీల వివరాలను అందుబాటులో ఉంచామన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎంఎల్‌సీ ఎన్నికకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

పాములవాకలో పారిశుధ్య చర్యలు



పాములవాకలో పారిశుధ్య డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ సత్యవతి

కోటవురట్ల : పాములవాకలో మంగళవారం పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. డ్రైనేజీలలో పేరుకుపోయిన పూడికలను పొక్లెయిన్ ద్వారా తొలగించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ పనులను సర్పంచ్ డి.సత్యవతి, మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. చాలా కాలంగా పూడికలు పెరిగిపోవడంతో డ్రైనేజీ సమస్యతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. పరిష్కారానికి సర్పంచ్ చర్యలు తీసుకున్నారు. దాంతో ప్రధాన డ్రైనేజీలో భారీగా పేరుకుపోయిన పూడికలను ప్రొక్లయిన్‌తో తొలగిస్తున్నారు. వర్షాలకు మురుగు కూపాల కారణంగా దోమలు వ్యాప్తి చెందాయని, రోగాలు ముసురుకోకుండా ముందస్తుగా చర్యలు చేపట్టినట్టు శ్రీనివాసరావు తెలిపారు.

వయనాడ్ బాధితుల కోసం విరాళాల సేకరణ



వయనాడ్ వరద బాధితుల కోసం పట్టణంలో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు



వయనాడ్ వరద బాధితుల కోసం రాంబిల్లిలో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

యలమంచిలి రూరల్ : ఇటీవల కేరళ రాష్ట్రం వయనాడ్‌లో వరద బీభత్సంతో నిరాశ్రయులైన బాధితుల సహాయార్థం మంగళవారం యలమంచిలి పట్టణంలో సీపీఎం పార్టీ నేతలు విరాళాలు సేకరించారు. పట్టణంలో ప్రధాన రహదారి పొడవునా వ్యాపారులు, ప్రజలను సీపీఎం నేతలు విరాళాలను అడిగారు. వయనాడ్‌లో భారీవర్షాల కారణంగా కొండ చరియలు విరిగి సంభవించిన వరదల్లో భారీగా ఆస్తి, ప్రాణ నష్టం సంభవించిందని ఇప్పటికీ గల్లంతైన చాలా మంది ఆచూకీ లభించలేదని, మానవతా దృక్పథంతో అందరూ కేరళ వరద బాధితులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కన్వీనర్ కర్రి అప్పారావు ప్రజలను కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రొంగలి రాము,చింతకాయల శివాజీ, బాలాజీ, సోమునాయుడు, జగన్ పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

రాంబిల్లి(యలమంచిలి): వయనాడ్ వరద బాధితులకు అపన్నహస్తంలా ప్రతి ఒక్కరూ నిలవాలని రాంబిల్లి సీపీఎం మండల కన్వీనర్ జి.దేముడునాయుడు కోరారు. రాంబిల్లి మండలంలో మంగళవారం సీపీఎం నాయకులు ఆధ్వర్యంలో వయనాడ్ బాధితుల సహాయార్థంగా విరాళాలు సేకరించారు. కేరళలో వరద ఉధృతికి రాష్ట్రం అతలాకుతలం అయిందని అన్నారు. బాధితులకు ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామకృష్ణ, ఎం.నారాయణరావు, కె.నూకరత్నం పాల్గొన్నారు.

సుప్రీం తీర్పుపై ఎమ్మార్పీఎస్ హర్షం

మాడుగుల రూరల్: ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలుపుతూ సుప్రీంకోర్టు తీర్పు నివ్వడం పట్ల ఎమ్మార్పీఎస్ నేతలు హర్షం వ్యక్తం చేస్తూ, మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కె.జె.పురంలోని బాబూ జగ్జీవన్‌రాం యువజన సేవా సంఘం అధ్వర్యంలో మంగళవారం మాదిగ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సంఘం సీనియర్ నాయకులు కండెల్లి వెంకటరావు మాట్లాడుతు ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతకు కృష్ణమాదిగ 30 ఏళ్ల ఉద్యమాన్ని కొనియాడారు. ప్రతి యువకుడు కృష్ణమాదిగ అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ చిన్నం లోవతల్లి, దాలిబాబు, ఎమ్మార్పీఎస్ సీనియర్ కార్యకర్తలు బి.జగ్గప్పారావు, చిన్నం మాలిబాబు, కొండారావు పాల్గొన్నారు.

19న విగ్రహ ప్రతిష్ట



గంగాలమ్మ తల్లి గుడికి విరాళం అందజేస్తున్న మాజీ ఎంపీటీసీ రూపావతి బుజ్జి

మునగపాక: అందరి సహకారంతో ఈ నెల 19న గంగాలమ్మతల్లి గుడిలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు తెలిపారు. దీనిలో భాగంగా భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. మునగపాకకు చెందిన మాజీ ఎంపీటీసీ రాజాన రూపావతి బుజ్జిబాబు మంగళవారం రూ.5,116 నగదును విరాళంగా ఆలయ కమిటీకి అందజేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఆడారి కాశీరావు, కాండ్రేగుల ఈశ్వరరావు, ఆడారి చిరంజీవి, కాండ్రేగుల సన్యాశినాయుడు.

తల్లిపాల విశిష్టతపై ర్యాలీ



పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన ర్యాలీ

ఎస్.రాయవరం : తల్లిపాలు సక్రమంగా బిడ్డకు పట్టడం వల్ల ఆరోగ్యవంతంగా ఉంటారని పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి రాజేశ్వరి అన్నారు. పెనుగొల్లు గ్రామంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలపై పీహెచ్‌సీ సిబ్బంది అవగాహన కల్పించారు. ఆశాడే సందర్భంగా పీహెచ్‌సీలో తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది శ్రీనివాస్,షేక్ అమీర్ షాజిద్ పాల్గొన్నారు.

విరిగి పడిన చెట్టుకొమ్మ...తప్పిన ప్రమాదం



సీసీ రోడ్డులో కూలిన చెట్టుకొమ్మ



చెట్టుకొమ్మ విరిగిపడడంతో పాక్షికంగా దెబ్బతిన్న ప్రహరీగోడ

కోటవురట్ల : స్థానిక సంతబయలు శివారు మసీదు వద్ద పెద్ద ప్రమాదం తప్పింది. భారీ మర్రి చెట్టు కొమ్మ విరిగి సీసీ రోడ్డుకు అడ్డంగా పడింది. ఘటన జరిగిన సమయం తెల్లవారు జాము కావడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు అంటున్నారు. ఈ మర్రిచెట్టు సుమారు 150 ఏళ్లనాటిది కావడంతో స్థానికులు ఎక్కువగా ఈ చెట్టు నీడన కాలక్షేపం చేసేవారు. కొమ్మ విరిగిపడిన సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. వాస్తవంగా మసీదులో నమాజు జరిగే సమయాల్లోను ఈ రోడ్డులో ఎక్కువగా జన సంచారం ఉంటుంది. అలాగే గవరపేట, జానకీరాంపురం వెళ్లే పాదచారులు, పొలాలకు వెళ్లే రైతులు మర్రిచెట్టు నీడన కాసేపు సేదతీరి వెళుతుంటారు. మధ్యాహ్న సమయంలో విరిగి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగేది. కొమ్మవిరిగి విద్యుత్ తీగెలపై పడగా సరఫరా నిలిపివేశారు. రోడ్డును ఆనుకుని ఉన్న ప్రహరీగోడపై పడడంతో పాక్షికంగా కూలిపోయింది. అయితే చెట్టు తొర్రలో గుర్తు తెలియని వ్యక్తులు యాసిడ్ వేశారని అందువల్లనే చెట్టు కొమ్మ శిథిలమై విరిగిపోయినట్టు చెబుతున్నారు. మసీదు రోడ్డుకు అడ్డుగా పడడంతో ఆ రోడ్డులో తాత్కాలికంగా రాకపోకలు నిలిచిపోయాయి. విరిగిన కొమ్మను తొలగించి రాకపోకలకు వీలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలి



ఆటలు ఆడుతున్న విద్యార్థులు

నక్కపల్లి : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెదరాంభద్రపురంలో రాబోవు స్వాతంత్ర దిన వేడుకలను పురస్కరించుకుని, ప్రధానోపాధ్యాయులు కోడి శ్రీనివాసరావు వ్యాయమా ఉపాధ్యాయులు షేక్ రహమాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు ప్రారంభించారు. విద్యార్థులు ఆనందోత్సాహాల నడుమ క్రీడల్లో పాల్గొన్నారు. మంగళవారం బాలికల సీనియర్స్, బాలుర సీనియర్స్‌కు కబడ్డీ పోటీలు నిర్వహించారు. పోటీలు ప్రారంభానికి ముందుగా వ్యాయామ ఉపాధ్యాయులు ఆయా జట్ల కెప్టెన్‌లను ప్రధానోపాధ్యాయులు కోడి శ్రీనివాసరావుకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ చదువుతో పాటు మానసిక ఆరోగ్యానికి ఆటలు ముఖ్యమ అన్నారు.

మెట్లపై నుంచి జారిపడిన వ్యక్తి మృతి

మునగపాక : వాడ్రాపల్లిలో మేడమెట్లపై నుంచి జారిపడి గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. వివరాలివి. వాడ్రాపల్లి గ్రామానికి చెందిన చదరం సత్యనారాయణ (63) ఈనెల 1న తన మేడపైకి వెళుతుండగా ప్రమాదవశాత్తూ మెట్లపై నుంచి జారిపడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతనిని విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సత్యనారాయణ మృతి చెందినట్టు ప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

11 మంది పేకాటరాయుళ్ళు అరెస్టు

నక్కపల్లి : మండలంలో గల నామవరం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వారి పై దాడులు నిర్వహించి 11 మందిని అదుపులోనికి తీసుకున్నట్టు ఏఎస్ఐ గోవిందు తెలిపారు. వీరి వద్ద నుండి 38 వేల రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

ఆరు మాసాల్లో జేజేఎం పనుల పూర్తి



అధికారులు, కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్న ఎస్ఈ కృష్ణారెడ్డి

కె.కోటపాడు: మాడుగుల నియోకవర్గంలో జల్ జీవన్ మిషన్ నిధులతో 120 గ్రామాల్లో జరగాల్సిన పనుల్ని ఆరు మాసాల్లో పూర్తి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కృష్ణారెడ్డి సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారుల్ని ఆదేశించారు. కె.కోటపాడు సబ్ డివిజన్ కార్యాలయంలో మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అల్లు సూర్యనారాయణతో పాటు నాలుగు మండలాల జేఈలు, కాంట్రాక్టర్లతో ఆయన సమావేశమయ్యారు.

‘పీఏసీఎస్ సభ్య రైతులు సమాచారమివ్వండి’

కె.కోటపాడు: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘా(పీఏసీఎస్)ల్లోని సభ్య రైతులు ప్రభుత్వ ఆదేశాల మేరకు వారి సమాచారాన్ని బ్యాంక్ సిబ్బందికి అందించాలని కె.కోటపాడు, చౌడువాడ పీఏసీఎస్‌ల అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ బి.గీతావాణి మంగళవారం తెలిపారు. రెండు పీఏసీఎస్‌ల సభ్య రైతులు వారి భూమి పాస్ పుస్తకం/1-బి, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, పాన్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డు జెరాక్స్‌లతో పాటు ఫోన్ నెంబర్, రెండు పాస్ ఫోటోలను బ్యాంక్ పని చేసే సమయాల్లో సిబ్బందికి అందించాలన్నారు.